సాక్షి ఒడిశా
మంగళవారం । 9 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,12,747లు, బంగారం 8.4 గ్రాములు, వెండి 136.95 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



రెడ్‌క్రాస్‌లో సభ్యత్వాన్ని పెంచాలి

- 8లో



హింజిలికాట్‌లో వీకే పాండ్యన్ పర్యటన

- 8లో

న్యూస్‌రీల్

ప్రపంచ శాంతికి కృషి చేయాలి

- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి శ్రీకాంత్ సాహు



సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీకాంత్ సాహు, పక్కన బ్రహ్మకుమారీలు

బరంపురం: మారుతున్న కాలానికి అనుగుణంగా మనమంతా ప్రవర్తిస్తూనే ప్రపంచశాంతి కోసం అంతా కలసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి శ్రీకాంత్ సాహు కోరారు. నగరంలోని రామచంద్రపూర్, ప్రభూ ఉపహార్ రిక్రూట్ సెంట్రల్ హాలులో ప్రజాపతి బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ శాంతికుండా ఆధ్వర్యంలో ప్రపంచశాంతి, ఆరోగ్యం, ఆనందం అనే అంశాలపై సదస్సు సోమవారం జరిగింది. రాజయోగిని మంజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఆధునిక కాలం రోజురోజుకూ ఎంతో మార్పు చెందుతుందని, అయితే ప్రజలకు మానసిక ప్రశాంతత కరువై సతమతం అవుతున్నారని తెలిపారు. యోగ, ధ్యానం చేయడం వల్ల ఆధ్యాత్మిక, మానసిక ప్రశాంతత పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో రాజయోగి మృత్యుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

17న పర్లాకిమిడి బంద్‌కు సీపీఎం పిలుపు



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకట్రావు

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ సమితి వల్లాడ గ్రామానికి చెందిన జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థిని సోధామిని రైతో 2నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె తల్లి సుజ్ఞాని జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట గత 13 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. దీనిపై కలెక్టర్ నుంచి స్పందన రాకపోవడంపై సీపీఐ(ఎం) నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు పార్టీ కార్యాయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఎం కార్యదర్శి దూపాన వెంకట్రావు మాట్లాడారు. ఈనెల 17న పర్లాకిమిడి పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. సమావేశంలో మృతురాలి తల్లి సుజ్ఞాని గమాంగో, కార్తీక్ శోబోరో, మోహిత్ మిశాల్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ ప్రవేశ పరీక్ష



అభ్యర్థుల హాల్ టిక్కెట్ పరిశీలిస్తున్న డైరెక్టర్ దుర్గాప్రసాద్ పాఢి

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో నీట్ మెడికల్ ప్రవేశ పరీక్ష ఆదివారం మధ్యాహ్నం విజయవంతంగా నిర్వహించారు. మెడికల్/డెంటల్ సైన్స్ వృత్తిలో ప్రవేశానికి గాను 292మంది విద్యార్థులు పరీక్ష రాశారు. సీఎంటీఎం డైరెక్టర్(పరిపాలన) దుర్గాప్రసాద్ పాఢి పర్యవేక్షించగా, డీన్ దేవరాజ్ గ్రహాచారి, డాక్టర్ ఎస్పీ నందా, పోలీసుశాఖ సిబ్బంది సహకారం అందించారు. సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీతా పాణిగ్రాహి, సెంటర్ సూపరింటెండెంట్ బినితా మల్లిక్, కృష్ణచంద్ర గజపతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్‌కుమార్ త్రిపాఠి, డిప్యూటీ సూపరింటెండెంట్ గౌరీ సాహు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు దోపిడి

రాయగడ: స్థానిక సాయి ఇంటర్నేషనల్ రోడ్డులో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన మహిళ మెడలో బంగారు గొలుసును దుండగులు దోచుకొని, పరారయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని 17 వార్డులో బుదరావలసకు చెందిన ఆర్.భానుమతి(53) రోజులాగే సోమవారం ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలోని 2తులాల బంగారు గొలుసును తెంపుకొని, పరారయ్యారు. దీనిపై భానుమతి భర్త ఆర్.కామరాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల రికార్డులను సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

తృతీయ రాగం..

- ముఖ్యమంత్రి నవీన్‌తో బీహార్ సీఎం నితీష్ భేటీ నేడు
- మూడో ప్రత్యమ్నాయ కూటమి ఏర్పాటుపై చర్చించే అవకాశం
- యూపీఏ, ఎన్‌డీఏ కూటములకు దూరంగా నవీన్ పట్నాయక్
- తాజా పరిణామాలపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ





సీఎం నవీన్ పట్నాయక్‌తో బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ భేటీ(ఫైల్)

భువనేశ్వర్: బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక నవీన్ నివాస్ సీఎం నవీన్ పట్నాయక్‌తో భేటీ కానున్నారు. ఇరువురు ముఖ్యమంత్రులు కలిసి మధ్యాహ్న భోజనం చేసే అవకాశం ఉంది. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల కదలికల ఛాయలు తారస పడుతున్నాయి. వ్యూహాత్మక కూటమి సన్నాహాలు క్రమంగా ఊపందుకుంటున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో 'బీజేపీ భగావో దేశ్ బచావో' నినాదంతో నితీష్‌కుమార్ దేశవ్యాప్తంగా ప్రతిపక్ష వర్గాలను ఒక తాటిపైకి తెచ్చే ప్రయత్నంలో తలమునకలై ఉన్నారు. ప్రధానంగా తృతీయ కూటమి ఆవిర్భావం దిశలో బిజూ జనతాదళ్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ తటస్థ వైఖరితో అటు జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్‌డీయే) ఇటు ప్రతిపాదిత తృతీయ కూటమి వర్గాలకు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. దీనిని సానుకూలంగా మలిచే దిశలో కొత్త కూటమి సారథులు సహనం కోల్పోకుండా సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో బీహార్ సీఎం రాష్ట్రంలో అడుగు పెడుతున్నారు. నవీన్‌తో భేటీ అనంతరం ఝార్కండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను ఆయన కలిసే అవకాశం ఉంది.

కీలక నేతలతో భేటీ..

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలను ఒక గూటిలోకి రప్పించే ప్రయత్నంతో నితీష్‌కుమార్ తాజా పర్యటన సాగుతున్నట్లు రాజకీయ వర్గాల భోగట్టా. ఇటీవల ఆయన ఏప్రిల్ 11న ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సహా పలువురు సీనియర్ కాంగ్రెస్ అగ్రనేతలను కలిశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, వామపక్ష నేతలు డి.రాజా, సీతారాం ఏచూరీ లతో భేటీ అయ్యారు. ఏప్రిల్ 24న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీని, లక్నోలో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధ్యక్షుడు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌లతో నితీష్ సమావేశమయ్యారు. ఆయన తరఫున పలువురు ప్రతిపక్ష పార్టీ నేతలతో నిరంతరం ఫోన్‌లో సంప్రదింపులతో చైతన్య పరుస్తున్నారు.

పక్కలో బల్లెం..

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ ఈ ఏడాది మార్చిలో భేటీ అయ్యారు. దీనిని బీజేపీకి వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పాటు కోసమేనని రాజకీయ శిబిరాల్లో సందడి చేసింది. అయితే మమత ఈ సమావేశాన్ని మర్యాదపూర్వక భేటీగా వ్యాఖ్యానించడంతో విపక్షాల కూటమి రాజకీయ చర్చ తుస్సుమని పోయింది. దేశం సమాఖ్య వ్యవస్థను పటిష్ఠ పరిచే దిశలో కృషి చేయాలని ఉభయులు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సూచన ప్రాయంగా పేర్కొన్నారు. ఇంతకుమించి ఇతర రాజకీయ చర్చలు జరగలేదని బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఉద్ఘాటించారు. 'ప్రాంతీయ పార్టీగా బీజేడీ అధికారంలో ప్రజలకు సుస్థిరంగా దీర్ఘకాల పాలన అందజేస్తుంది. రాష్ట్ర స్వార్థ ప్రయోజనాలకు దోహదపడే రీతిలో బీజేడీ వైఖరి ఉంటుంద'ని విపక్షాల కూటమి ప్రతిపాదనకు సుతిమెత్తగా తోసి పుచ్చుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి బీజేడీ సమాన దూరం పాటిస్తుందని నవీన్ పట్నాయక్ తరచూ ప్రకటించడం విశేషం. మరోవైపు ఆయన నేతత్వంలో రాష్ట్ర పాలన పగ్గాలు చేపట్టిన బీజేడీ 2019 నుంచి దాదాపు అన్ని సందర్భాల్లో కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రతిపాదనలకు అండగా నిలుస్తున్న పరిస్థితి వాస్తవం.

సొంతింటి కల నెరవేరే వేళ..

బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ వివిధ పార్టీల నాయకులతో కలిసి కేంద్రంలోని అధికార పార్టీ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీయే కూటమికి వ్యతిరేకంగా ఫ్రంట్ ఏర్పాటు చేయాలనే నితీష్ ప్రణాళికలో భాగస్వామ్యం పొందే అవకాశం లేదు. రెండు ప్రధాన కారణాలతో బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ బీజేపీయేతర తృతీయ కూటమికి దూరంగా ఉంటున్నట్లు స్పష్టం అవుతోంది. కాంగ్రెస్ పతనమే ధ్యేయంగా రాష్ట్రంలో బిజూ జనతాదళ్ ఆవిర్భవించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ భాగస్వామ్యం కలిగిన కూటమిలో బీజేడీ తలదూర్చేందుకు ఇష్టపడటం లేదు. జాతీయ, కేంద్ర పదవుల పట్ల ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు అంతగా మక్కువ లేదు. రాష్ట్రంలో ఆయనకు అపారమైన ప్రజాదరణ ఉంది. అపజయం ఎరుగని ఏకైక నాయకుడుగా వెలుగొందుతున్నాడు. ఆయన జీవిత కాలంలో రాష్ట్ర ప్రజలు ఆయనను నిరాకరించే పరిస్థితులు ఏమాత్రం లేవనే గట్టి నమ్మకంతో నవీన్ పట్నాయక్ నిత్య నూతన ప్రణాళికలు, కార్యక్రమాలు, వ్యూహాలతో రాష్ట్రంలో నిరవధికంగా పాలన కొనసాగిస్తున్నారు. ఈ పరపతితో జీవిత కాలపు ముఖ్యమంత్రిగా కొనసాగాలనే దృఢ సంకల్పంతో దూసుకు పోతున్నారు. ఎన్నికల పొత్తుతో బంగారు బంధాలను తెంచుకుని పదవీ ఇతరేతర వ్యామోహాలు, వ్యూహాలతో జట్టు కట్టే ప్రసక్తే లేదని నవీన్ సన్నిహిత వర్గాల సమాచారం. అయితే ఇటీవల కాలంలో రాష్ట్ర రాజకీయ రంగంలో అధికార బిజూ జనతా దళ్, ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ మధ్య విభేదాలు, విద్వేషాలు తరచూ వీధికి ఎక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా పరిణామాల పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

వినతుల స్వీకరణకు ఆహ్వానం



పర్లాకిమిడి: గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ లింగరాజ్ పండా, అధికారులు

రాయగడ: జిల్లాలోని వినతుల డారిలో వినతుల స్వీకరణ కార్యక్రమం సోమవారం చేపట్టారు. జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ్ ప్రధాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి, గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహారో, సీడీఎంఓ డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్, పంచాయతీ సమితి అధ్యక్షురాలు లక్ష్మీ సాబొరొ, జిల్లా సామాజిక సంక్షేమశాఖ అధికారి యజ్ఞజేసి బెహరా, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి 26వినతులు అధికారుల దృష్టికి రాగా.. ఇందులో 23 వ్యక్తిగత సమస్యలు, మరో 3గ్రామ సమస్యలుగా గుర్తించారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలిని వివాహం చేసుకున్న వ్యక్తికి జిల్లా సామాజిక సురక్ష సమితి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.2.50 లక్షల ఆర్థిక సాయాన్ని ఏడీఎం ప్రధాన్ అందజేశారు.

దాబుగాంలో..

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా దాబుగాంలో కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా జిల్లాస్థాయి గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. సమావేశంలో అక్కడిక్కడే 29 ప్రజా సమస్యలు పరిష్కరించారు. ఐదుగురు దివ్యాంగులకు చక్రాల కుర్చీలు, 8 గుర్తింపుకార్డులు మంజూరు చేశారు.

గైబ పంచాయతీ కార్యాలయంలో..

పర్లాకిమిడి: జిల్లాలోని గుమ్మా సమితి గైబ పంచాయతీ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ లింగరాజ్ పండా, డీఎస్పీ వామదేవ్ సింగ్, ఐటీడీఏ పీఓ ఫాల్గుణి మాఝి, ఎస్డీసీ చైర్‌పర్సన్ మరియం రైతో పాల్గొన్నారు. గైబ పంచాయతీలోని పారిడా, ఖైజ గ్రామాలలో నిర్వహించారు.



రాయగడ: లబ్ధిదారుకి చెక్కు అందిస్తున్న దృశ్యం



కొరాపుట్: దివ్యాంగులకు చక్రాల కుర్చీలు అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ఆస్పత్రిలో రతన్ నాయక్ మృతదేహం

జయపురం: సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఛతిడిపుట్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. మృతుడు బొయిపరిగుడ సమితి నువాగుడ గ్రామానికి చెందిన రతన్ నాయక్‌గా సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... రతన్, అతని తల్లి లలిత నాయక్ బైక్‌పై జయపురం వెళ్తుండగా ఛతిడిపుట్ గ్రామంలోని కాలువ వద్ద గుర్తు తెలియని బలంగా ఢీకొని, వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అతని తల బలంగా రోడ్డును తాకడంతో తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఫార్మాసిస్ట్‌పై వేటు

- రాష్ట్రపతి హెలికాప్టర్‌తో సెల్ఫీ ఉదంతంపై ప్రభుత్వం చర్యలు

భువనేశ్వర్:

భద్రతా వలయం అధిగమించి రాష్ట్రపతి హెలికాప్టర్‌తో సెల్ఫీ తీసుకోవడం సమస్యాత్మకమైంది. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో పరిస్థితి మరింత బిగుసుకుంది. ఈ చర్యకు పాల్పడిన ఫార్మసిస్ట్‌కు వ్యతిరేకంగా మయూర్‌భంజ్ జిల్లా ప్రధాన వైద్యాధికారి(సీడీఎంఓ) చర్యలు తీసుకున్నారు. ఫార్మసిస్ట్ యశ్వంత్ బెహెరాను వెంటనే విధుల నుంచి తొలగిస్తునట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన జముకేశ్వర్ ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మయూర్‌భంజ్ జిల్లా పర్యటన సందర్భంగా రక్షణ కోసం 400మంది సీనియర్ అధికారులు, 40 ప్లటూన్ పోలీసు బలగాలను మోహరించారు. ఈనెల 5న ఆమె వైమానిక దళానికి చెందిన ప్రత్యేక హెలికాప్టర్‌లో సిమిలిపాల్ పర్వత ప్రాంతంలోని తాత్కాలిక హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా రోడ్డు మార్గంలో సిమిలిపాల్ అభయారణ్యంలోకి ప్రవేశించారు. రాష్ట్రపతి వచ్చిన మూడు హెలికాప్టర్లలో ఒక హెలికాప్టర్ వద్ద డ్యూటీలో ఉన్న ఫార్మాసిస్ట్ సెల్ఫీ తీసుకున్నారు. అలాగే తన ఫేస్‌బుక్ అకౌంట్‌ల ఖాతాలో కూడా పోస్ట్ చేశాడు. అయితే, ఫార్మాసిస్ట్ హెలికాప్టర్‌తో భద్రతా బలగాలు ఎలా చిత్రాలు తీశారనే ప్రశ్న తలెత్తింది. వివాదం తీవ్రరూపం దాల్చడంతో మయూర్‌భంజ్‌కు చెందిన సీడీఎంఓపై చర్య తీసుకుంది. ఈ ఘటనపై యశ్వంత్ బెహెరా స్పందిస్తూ.. జ్ఞాపకార్థం ఉంచుకోవడానికి బాధ్యతలు నిర్వహిస్తున్న జవాన్లను ఫోటో తీయమని తాను కోరినట్లు వివరించాడు.



రాష్ట్రపతి హెలికాప్టర్ ముందు ఫార్మాసిస్ట్ యశ్వంత్ బెహరా

పంపుణీలో సందడిగా బలిజాతర



భీమా రాజు, భీమా రాణిలతో ఊరేగింపు



బలిజాతరలో విత్తనాలు మొలకెత్తిన బుట్టలతో పాల్గొన్న మహిళలు

జయపురం: స్థానిక సమితి పంపుణీ గ్రామంలో సంప్రదాయ వ్యవసాయ పండగ బలిజాతర ఆదివారం సాయంత్రం సందడిగా సాగింది. ఈ గ్రామంలో 12 ఏళ్ల తరువాత బలిజాత్ర చేపట్టడంతో పరిసర గ్రామాల నుంచి వచ్చిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. దేవతలైన భీమరాజ, భీమరాణి లను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నృత్యాలు, వాయిద్య గీతాలతో యువకుల డ్యాన్స్‌లతో హోరెత్తించారు. సోమవారం పాచి బలిజాతర జరిపారు. సమీపంలోని నది నుంచి బుట్టలతో తీసుకు వచ్చిన ఇసుకలో ధాన్యం, పెసలు, మినుములు, ఆవాలు, గోధుమలు, చోడి విత్తనాలు చల్లి, బలి గృహంలో భద్రపరిచారు. వీటికి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. బలిజాతరలో విత్తనాలు మొలకెత్తిన బుట్టలతో మహిళలు పాల్గొన్నారు.

ప్రచారానికి తెర

- రేపే ఝార్సుగుడ ఉప ఎన్నికల పోలింగ్
- 253 పోలింగ్ కేంద్రాలు, వెయ్యి మంది అధికారులు కేటాయింపు



నికుంజ బిహారీ ధొలా, ప్రధాన ఎన్నికల అధికారి



భువనేశ్వర్: ఝార్సుగుడ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారానికి సోమవారంతో సాయంత్రంతో తెరపడింది. ఈనెల 10న బుధవారం ఉప ఎన్నిక పోలింగ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో 253 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఎన్నిక ప్రక్రియ శాంతియుతంగా నిర్వహించేందుకు 1,000 మందికి పైగా పోలింగ్ అధికారులను మొహరించారు. ఉప ఎన్నికల సన్నాహాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) నికుంజ బిహారీ ధొలా సోమవారం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఓట్ల పోలింగ్ కోసం మొత్తం 253 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో 26 పింక్ బూత్‌లు మహిళా ఓటర్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ సజావుగా కొనసాగించేందుకు ప్రతి పోలింగ్ బూత్ వద్ద నలుగురు చొప్పున మొత్తం 1,012మంది పోలింగ్ అధికారులను నియమించారు. 96మంది పోలింగ్ అధికారులను రిజర్వ్‌లో ఉంచగా, 69 బూత్‌లలో మైక్రో అబ్జార్వర్‌లను నియమించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని బూత్‌లలో బుధవారం ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు నిరవధికంగా కొనసాగుతుంది. వాస్తవ పోలింగ్‌కు గంటన్నర ముందు మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. పారదర్శకతను నిర్ధారించడానికి, బూత్ క్యాప్చర్‌ను నిరోధించడానికి అన్ని బూత్‌లలో వెబ్‌కాస్టింగ్ సదుపాయాన్ని కల్పించారు.

మొత్తం 2,21,070 మంది ఓటర్లు..

నియోజకవర్గంలోని 144 బూత్‌ల వద్ద సీఏపీఎఫ్ సిబ్బందిని కూడా నియమించనున్నట్లు సీఈఓ తెలిపారు. 155మంది పోలీసు అధికారులు, 17 ప్లాటూన్లు సాయుధ పోలీసులు, 323మంది హవాల్దార్లు, కానిస్టేబుళ్లు, 205మంది హోంగార్డులు, 7 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు దళాలు(సీఏపీఎఫ్)తో మొత్తం 1,814మంది పోలీసు సిబ్బంది పోలింగ్ ఆద్యంతాలు శాంతి భద్రతల కార్యకలాపాల్లో పాలుపంచుకుంటారని వివరించారు. పోలింగ్ అధికారులు ఝార్సుగుడ ఇంజినీరింగ్ పాఠశాలకు చేరుకున్నారు. వారు ఓటింగ్‌కు ముందు నియోజకవర్గంలోని వారి నిర్దేశిత బూత్‌లకు వెళ్తారు. అసెంబ్లీ నియోజకవర్గంలో 1,10,320మంది పురుషులు, 1,10,687మంది మహిళ ఓటర్లు ఉన్నారు. వీరితో 63మంది థర్డ్ జెండర్(హిజ్రా) సహా సమగ్రంగా 2,21,070మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. జనవరి 29న సిట్టింగ్ ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి నవకిషోర్ దాస్ హత్య తర్వాత ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం ఓట్ల లెక్కింపు ఈనెల 13న నిర్వహిస్తారు.

క్లుప్తంగా

మైనర్‌పై అసభ్యకర ప్రవర్తన

● యువకుడిపై పోక్సో కేసు నమోదు

వజ్రపుకొత్తూరు: మైనర్‌పై ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పూండికి సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న కొమరల్తాడ గ్రామానికి చెందిన 30 ఏళ్ల కొంకి పవన్ మైనర్ బాలికకు ఐస్‌క్రీమ్, కూల్ డ్రింకు ఇచ్చి లోబరుచుకున్నాడు. బాత్‌రూంకు తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలిక పోలీసులకు వాంగ్మూలం ఇచ్చింది. దీంతో ఆమెను పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ విషయాన్ని వజ్రపుకొత్తూరు ఎస్సై వై.మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా బాలికపై పవన్ అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పవన్‌ను అదుపులోకి తీసుకుని పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేశామన్నారు.

ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా కామరాజు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బడియా కామరాజు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన తెలిపారు. విజయవాడలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ అధ్యక్షుడు జె.బి.రాజు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగినట్టు చెప్పారు. ఇప్పటికే విజయనగరం డివిజన్ ఏపీసీటీసీ అండ్ ఎస్టీ, ఎస్సీ ఎంప్లాయిస్ అధ్యక్షునిగా పనిచేస్తున్నట్టు చెప్పారు. కామరాజు ఎన్నికపై దళిత సంఘ నాయకులు కంఠ వేణు, కళ్లేపల్లి రాంగోపాల్, పిట్ట చంద్రపతిరావు, రాయి వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

ఉప ముఖ్యమంత్రికి ఉత్సవ ఆహ్వానం

వీరఘట్టం: వీరఘట్టంలో ఏడేళ్ల తర్వాత జరిపే పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనాలని ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. వీరఘట్టం గ్రామదేవత విశిష్టతను రాజన్నదొరకు వివరించారు. మంగళవారం జరగనున్న సిరిమానోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని కోరారు.

సేవలకు సత్కారం

విజయనగరం ఫోర్ట్: విజయవాడలోని రాజ్‌భవన్‌లో సోమవారం జరిగిన రెడ్‌క్రాస్ వేడుకల్లో జిల్లాకు చెందిన పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ వాస్తవ్, అరబిందో ఫార్మా ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ రాధామాధవ్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ గోల్‌మెడల్ ప్రదానం చేశారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు పాల్గొన్నారు.

సొసైటీల్లోనూ ఆన్‌లైన్ సేవలు

● డీసీసీబీ సీఈఓ జనార్దన

విజయనగరం ఫోర్ట్: డీసీసీబీ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోనూ ఆన్‌లైన్ సేవలు ప్రారంభిస్తామని డీసీసీబీ సీఈఓ కెంబూరి జనార్దన తెలిపారు. పార్వతీపురం సొసైటీలో కామన్ సర్వీసింగ్ సెంటర్ (సీఎస్సీ) సేవలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు ద్వారా ప్రజలకు 50 రకాల సేవలు అందిస్తామన్నారు. జిల్లాలో ఉన్న మిగిలిన సొసైటీల్లో కూడా సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

పక్కాగా నిబంధనలు అమలు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రైవేటు కళాశాలల అఫిలియేషన్ పునరుద్ధరణకు నిబంధనలు పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రైవేటు కళాశాలల అఫిలియేషన్ పునరుద్ధరణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలల పత్రాలను తనిఖీ బృందాలు పరిశీలించి నివేదికను అఫిలియేషన్ కమిటీకి అందజేయాలన్నారు. కమిటీ నిర్ణయం మేరకు ఇంటర్మీడియట్ బోర్డుకు నివేదికను పంపిస్తామని చెప్పారు. ప్రైవేటు కళాశాల అఫిలియేషన్ పునరుద్ధరణ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ వైస్‌చైర్మన్‌గా, అగ్నిమాపక అధికారి, డీపీఓ, మున్సిపల్ కమిషనర్ సభ్యులుగాను, ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి కన్వీనర్‌గా ఉంటారు. తనిఖీ బృందంలో పార్వతీపురం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి డి.మంజులావీణ, కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.నాగేశ్వరరావు, పార్వతీపురం జూనియర్ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ జి.ప్రదీప్‌కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, అగ్నిమాపక అధికారి శ్రీనుబాబు, డీపీఓ బి.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవానీమాతను దర్శించిన రోజా

మక్కువ: మండలంలోని పాపయ్యవలస గ్రామంలోని భవానీమాత ఆలయాన్ని పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా సోమవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఆమె చేతుల మీదుగా అమ్మవారికి అర్చనలు జరిపారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా అమ్మవారిని దర్శించుకునేందుకు రోజా వచ్చారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మరోమారు భవానీమాతను దర్శించుకునేందుకు పాపయ్యవలస గ్రామానికి చేరుకోవడంతో ఆమెను చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు.

రెడ్‌క్రాస్‌లో సభ్యత్వాన్ని పెంచాలి



రాయగడ: హెన్రీ డునాంట్ చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్



మల్కన్‌గిరి: జెండా ఊపి అంబులెన్స్ ప్రారంభిస్తున్న ఏడీఎం చంద్రనాయక్

● సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్

పర్లాకిమిడి: ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో సమాలోచన సభ ఆదివారం నిర్వహించారు. తొలుత రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు మేజిస్ట్రేటు రాజేంద్ర మింజ్, ఎమర్జెన్సీ అధికారి ప్రభాస్‌కుమార్ బెహరా, సంపాదకులు ద్విజేంద్రనాథ్ పాఢి, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీకి నిధులు పెంచాల్సిందిగా సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు సూచించారు. రెడ్‌క్రాస్ నిధుల నుంచి నిస్సహాయులు, అత్యవసర వైద్య అవసరాలకు నిధుల పంపిణీ పెంచాలని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి ద్విజెన్ పాఢి కోరారు. జీవిత బీమా సభ్యులు, వార్షిక చందాదారులను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో మహారాజా బాలుర ఉన్నత పాఠశాల, రెవెన్యూ, ఆర్‌టీఓ, వాణిజ్య పన్నులశాఖ అధికారులు పాల్గొన్నారు.

అటానమస్ కళాశాలలో..

రాయగడ: స్థానిక అటానమస్ కళాశాలలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసన్నకుమార్ గంతాయత్, అధ్యాపకులు డాక్టర్ బాబిలత నరష్, రెడ్‌క్రాస్ కౌన్సిలర్ ఎం.శ్రీనివాస్ ఆచారి, కె.భారతీ ఆచారి తదితరులు పాల్గొని, హెన్నీ డునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఎంతోమందికి ఆసరాగా నిలుస్తున్న రెడ్‌క్రాస్ సేవలను వక్తలు కొనియాడారు.

అంబులెన్స్ సేవలు ప్రారంభం..

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో కొనుగోలు చేసిన అంబులెన్స్‌ను అదనపు కలెక్టర్ మహేశ్వర్ చంద్రనాయక్ ప్రారంభించారు. మారుమూల గ్రామాల్లో సైతం రోగులకు అందుబాటులో సేవలందించేందుకు దీనిని వినియోగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రఫుల్లకుమార్ నందో, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.



జయపురం: ప్రసంగిస్తున్న హెచ్‌ఎం ప్రకాశ్‌చంద్ర మహంతి

హింజిలికాట్‌లో వీకే పాండ్యన్ పర్యటన



నియోజకవర్గంలో చేపడుతున్న పనుల పురోగతిని తెలుసుకుంటున్న 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్

● వివిధ అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన

బరంపురం: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లా హింజిలికాట్ నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వ 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుంచి ఇక్కడికి చేరుకున్న ఆయన.. నియోజకవర్గంలోని సరగడా బ్లాక్‌కు రోడ్డు మార్గాన చేరుకున్నారు. తొలుత స్థానిక నర్సింహస్వామి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హింజిలి సైన్స్ కళాశాలలో జరుగుతున్న వార్షికోత్సవంలో పాల్గొని, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం సమరిజులి గ్రామంలోని శంకర్ నేత్రాలయానికి చేరుకొని బాధితులకు అందుతున్న సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెరగడా బ్లాక్‌లో అంగన్‌వాడీ, స్వయంసహాయక సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో 5టీ కార్యదర్శి వినీల్‌కృష్ణ, కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మినా తదితరులు పాల్గొన్నారు.



పాండ్యన్‌తో శంకర్ నేత్రాలయం వైద్యులు

రైతుల సహకారంతోనే లక్ష్యం పూర్తి



వేదికపై ప్రసంగిస్తున్న కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ పాణిగ్రాహి, ఉన్నతాధికారులు, డైరెక్టర్లు

● కేసీసీబీ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి

కొరాపుట్: రైతులకు సహకరించడంతోనే బ్యాంక్ లక్ష్యం పూర్తవుతుందని కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి పేర్కొన్నారు. నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మిషన్‌శక్తి సమావేశ మందిరంలో సోమవారం జరిగిన బ్యాంక్ జిల్లాస్థాయి ఉన్నతాధికారుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కొరాపుట్, రాయగడ, నవరంగ్‌పూర్, మల్కనగిరి జిల్లాల్లో విస్తరించి ఉన్న కేసీసీ బ్యాంక్ రైతుల సంక్షేమం కోసం పని చేస్తోందని గుర్తుచేశారు. సహకార విభాగ కార్యాలయాలు రైతులకు బ్యాంకులకు మధ్య వారధిలా పని చేయాలన్నారు. నిధులకు కొరత లేదని, రానున్న ఖరీఫ్ సీజన్‌కు అర్హులైన రైతులకు రుణాలు అందజేయాలని సూచించారు. ఈశ్వర్ పాణిగ్రాహి బ్యాంక్ అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం జరిగిన తొలి సమావేశం కావడంతో జిల్లావ్యాప్తంగా 10 సమితులు, 2 పురపాలక సంఘాల నుంచి అధికారులు, బ్యాంక్ డైరెక్టర్లు హాజరయ్యారు.



హాజరైన బ్యాంకుల సిబ్బంది, సహకార సంఘాల నాయకులు

అంకితభావంతో విధుల నిర్వహణ

● ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్: అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజలకు, పోలీసులకు సంధానకర్తలుగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. మహిళల భద్రతకు కృషి చేయాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మహిళా పోలీసుల విధివిధానాలు, ప్రజా, మహిళల భద్రత, యువత సన్మార్గంలో నడిపేంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ సోమవారం నిర్వహించారు. మనపై ఉన్న బాధ్యతను అధికారికంగా భావించకుండా నేర రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. క్రమశిక్షణతో పని చేయాలని, అంకితభావంతో విధులు చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరూ జాబ్ రూల్స్ పాటించాలని, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. యువతతో సమాజంలో మార్పు వస్తోందన్నారు. యువతపాత్ర కీలకమన్నారు. ప్రతిమహిళ పోలీసు తమ పరిధిలోని సుమారు 20 మంది యువకులను గుర్తించి సైబర్ నేరాలు, ట్రాఫిక్, నైట్‌బీట్లు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సందేశాత్మక అంశాలు, ముఖ్యమైన చట్టాలపై ఐదు రోజులు శిక్షణ ఇవ్వాలన్నారు.

ప్రజల ఆరోగ్య సమాచారం సిద్ధంగా ఉండాలి



హిరమండలం పీహెచ్‌సీని పరిశీలిస్తున్న సిద్ధార్థ జైన్

హిరమండలం: ప్రజల ఆరోగ్య, ఇతర సంక్షేమ పథకాల సమాచారం అధికారుల వద్ద సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ల్యాండ్, సెటిల్మెంట్ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి సిద్ధార్థ జైన్ అన్నారు. హిరమండలం పీహెచ్‌సీని సోమవారం పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై సిబ్బందితో సమీక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య పథకాలు, రికార్డుల నిర్వహణను వైద్యురాలు సాయిగీతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్యారేజ్ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. బాలింతలకు గర్భిణులు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారం వివరాలను జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవుని నుంచి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా పని చేస్తున్నామన్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్, టెక్కలి డివిజన్ డీఎంహెచ్‌వో లక్ష్మీతులసీ, కొత్తూరు ఐసీడీఎస్ పీవో విమలరాణి, తహసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీవో శైలజ పాల్గొన్నారు.

నేడు వాసుదేవుని సన్నిధిలో వసంతోత్సవం

మందస: మందస పట్టణంలోని వాసుదేవస్వామి ఆలయంలో మంగళవారం వసంతోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు సోమవారం తెలిపారు. ఆలయ పునఃప్రతిష్ఠ జరిగి 14 సంవత్సరాలు కావస్తోందని, ఈ సందర్భంగా వాసుదేవుడు, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు వసంతోత్సవ అభిషేకం, అలంకరణ, అర్చనలు జరుగుతాయన్నారు. స్వామి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రయుత పూజలు, ఉత్తర ద్వార దర్శనం కూడా కల్పిస్తామన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు వాసుదేవస్వామి మూలమూర్తికి, ఉత్సవవర్తకు ఉభయ దేవేరుల సమేతంగా పూజలు ప్రారంభమవుతాయన్నారు.

'నీట్' తప్పుతానేమోనని..

ప్రాణం తీసుకున్నాడు..

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళంలోని పీఎన్ కాలనీ 10వ లైన్‌కు చెందిన సనపల హర్షవర్దన్(19) సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు రెండో పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. నీట్ పరీక్ష తప్పుతానేమోనని భయపడి విద్యార్థి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పీఎన్ కాలనీ పదో లైన్‌కు చెందిన హర్షవర్దన్ ఇంటర్ పూర్తయ్యాక నీట్ ఎగ్జామ్స్ కోచింగ్ తీసుకుని ఆదివారం శివానీ కాలేజీలో పరీక్ష రాశాడు. అదే రోజు రాత్రి వచ్చిన కీ చూసుకుని తక్కువ మార్కులు వస్తున్నాయని బాధ పడ్డాడు. దీంతో విద్యార్థిని తండ్రి రంగబాబు ఓదార్చారు. విద్యార్థి తల్లి వారం కిందట పుట్టింటికి వెళ్లడం, సోదరి బెంగళూరులో చదువుతుండడంతో తండ్రీకొడుకులు మాత్రమే ఉన్నారు. సోమవారం ఉదయం రంగబాబు బయటకు వెళ్లారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో హర్షవర్దన్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. ఇంటికి వచ్చి చూస్తే తలుపులు మూసి ఉన్నాయి. కిటికీలో నుంచి చూడగా హర్షవర్దన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో తండ్రి నిశ్చేష్టుడైపోయాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

బూర్జ: మండలంలో గల తోడవాడ గ్రామానికి చెందిన గేదెల అమ్మడు (30) అనే వివాహిత సోమవారం సాయంత్రం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గేదెల అమ్మడుకి ఎనిమిదేళ్ల కిందట గేదెల సాయికుమార్‌తో వివాహమైంది. వీరిది కులాంతర ప్రేమ వివాహం. వీరికి రెండు, నర్సరీ చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాలు ఉన్నట్లు సమాచారం. ఈ చిన్ని చిన్న ఘర్షణల వల్లే అమ్మడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సాయికుమార్ వివాహాలకు అలంకరణ సామగ్రి అద్దెకు ఇస్తుంటారు. ఈ ఆత్మహత్యపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.



గేదెల అమ్మడు (ఫైల్)

'మా పాతికేళ్ల కలను నిజం చేశారు'



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, డీఎస్సీ-98 ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుద్యోగుల పక్షపాతి అని, పాతికేళ్ల కలను నిజం చేశారని డీఎస్సీ 1998 ఉపాధ్యాయులు అన్నారు. పలాసలో మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద మంత్రి సీదిరి అప్పలరాజుతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు ప్రతిపక్ష నేత హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగం కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో చాలా ప్రభుత్వాల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని, తమను గురువుల స్థానంలో నిలబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు.

తల్లిదండ్రులూ..



బహుపరాక్..!

● చిన్నారులకు వాహనాలు ఇవ్వొద్దు
● ప్రమాదాలకు కారకులు కావొద్దు..
● హెచ్చరిస్తున్న పోలీసులు
● వాహనాలు నడుపుతున్న మైనర్లకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్
● జిల్లాలో గత ఐదునెలల్లో 41,644 మందిపై కేసుల నమోదు
● రూ.76.51 లక్షల జరిమానా

తెలిసీతెలియని వయసు.. బైక్ నడపడంపై మోజు.. రోడ్డు నిబంధనలపై పూర్తిగా అవగాహన లేకపోవడం.. వాహనాల వేగాన్ని నియంత్రించలేకపోవడం వంటి కారణాలతో మైనర్లు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరు ప్రాణాలు విడుస్తూ.. మరికొందరి ప్రాణాలను హరిస్తున్నారు. క్షతగాత్రులుగా మారుతున్నారు. తల్లిదండ్రులు (బైక్ యజమానులు)ను నిందితులను చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పోలీసులు ఇటీవల కాలంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. బైక్‌లు నడిపే మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. తీరుమార్చుకోనివారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

పార్వతీపురంటౌన్:

'పార్వతీపురం పట్టణంలో ఈ నెల 1వ తేదీన ఓ మైనర్ బాలుడు తన స్నేహితుడి వద్ద రాయల్ ఎన్ఫీల్డ్ వాహనాన్ని తీసుకున్నాడు. అజాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తూ వాహనాన్ని అదుపు చేయలేక వంగపండు అప్పయ్యమ్మ(78) అనే వృద్ధురాలిని ఢీకొట్టాడు. ఆమె ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెంది. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిపై కేసు నమోదైంది. మైనర్‌కు వాహనం ఇచ్చిన యజమానిపై కూడా పోలీసులు కేసు నమోదుచేశారు.'

'ఈ ఏడాది జనవరి 1వ తేదీన గరుగుబిల్లి గ్రామానికి చెందిన ఒక మైనర్ అతని స్నేహితుడితో కలిసి గ్లామర్ వాహనంపై ప్రయాణిస్తూ వేగాన్ని నియంత్రించలేక ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటనలో చనిపోయిన కుర్రవాడికి లైసెన్స్ లేదు. ఎదిగొచ్చిన కొడుకుని కోల్పోవడంతో పాటు ఈ కేసులో వాహన యజమాని అయిన కుర్రవాడి తండ్రి నిందితుడయ్యాడు.'

ఇటీవల కాలంలో అధికమంది మైనర్లు రోడ్లపై వాహనాలు నడుపుతున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ప్రమాదకరం కూడా.. చాలా మంది పిల్లలు, వారి తల్లిదండ్రులు ఈ ముప్పును గ్రహించలేకపోతున్నారు. అతిగారాభం, పిల్లలకు ఏ లోటు లేకుండా చూడాలనే ఆలోచనతో చేతికి బండి ఇస్తున్నారు. తెలియనితనం, వచ్చీరాని డ్రైవింగ్‌తో విన్యాసాలు చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఎక్కువగా అదుపు తప్పి ఎదురుగా ఉన్న వ్యక్తిని ఢీకొట్టడం, తనకు తానుగా పడిపోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. వీటిలో అధికశాతం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లడం లేదు. చిన్నపిల్లలు కదా స్టేషన్‌కు వెళ్తే కేసు అవుతుందనే ఉద్దేశంతో రాజీ చేసుకుంటున్నారు. మరికొన్ని ఘటనలు పోలీసుల వరకు వెళ్లినా పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఇరువర్గాలకు రాజీ మార్గమే చూపుతున్నారు. పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు. ప్రతీ శనివారం జిల్లాలో నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. తీరుమార్చుకోనివారిపై కేసులు నమోదు చేస్తున్నారు.



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది



ఇలా అయితే ఎలా: పార్వతీపురంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మైనర్లు (ఫైల్)


పార్వతీపురం మన్యం జిల్లాలో ఐదు నెలల్లో నమోదైన కేసుల వివరాలు..

నెల	నమోదైన కేసులు	అపరాధ రుసుం
డిసెంబర్	8,959	1,65,4750
జనవరి	6454	1,27,5300
ఫిబ్రవరి	7742	1,35,9150
మార్చి	6433	1,21,0400
ఏప్రిల్	12056	2,15,2300

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్

అసలే వేసవి సెలవులు.. విద్యార్థులందరూ ఇళ్లలోనే ఉంటారు. బైక్‌లతో ర్యాష్ డ్రైవింగ్ చేయడం, రహదారులు ఖాళీగా ఉన్నాయనే ఉద్దేశంతో వాయువేగంతో వెళ్తుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని పోలీసులు గుర్తించారు. నిబంధనలు పాటించకుండానే మైనర్లు రోడ్లపైకి దూసుకొస్తుండడంతో కొంత కాలంగా స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్నారు. కేసులు నమోదుచేసి ఈ చలానా రూపంలో తల్లిదండ్రులకు జరిమానాలు వసూలు చేస్తున్నారు.

ప్రమాదాలకు ప్రధాన కారణాలివీ...



ట్రాఫిక్ నియమాలు తెలియకపోవడం, అతివేగంతో ప్రయాణించడం, మద్యం తాగి వాహనం నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వెళ్లడం, ఇద్దరికి మించి ప్రయాణించడం, హెల్మెట్ ధరించకపోవడం, ముందు వాహనాన్ని దాటి వెళ్లాలని ప్రయత్నించడం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా పోలీసులు చెబుతున్నారు.

మైనర్ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు



రోడ్లపై మైనర్లు వాహనాలు నడుపుతూ ఎక్కడ కనిపించినా వారి తల్లిదండ్రులు లేదా వాహన యజమానిపై కేసు నమోదు చేస్తాం. కొందరు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణ మవుతున్నారు. తల్లిదండ్రులు, పర్యవేక్షకులు ఎవరైనా 18 ఏళ్ల నిండనివారికి వాహనాలు ఇస్తే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాం. తల్లిదండ్రుల్లో మార్పు రావాలి. పిల్లల సరదా కోసం ఆలోచిస్తే వారితో పాటు బయటి వారు ప్రమాదాల బారిన పడాల్సి వస్తుంది.

– విక్రాంత్ పాటిల్, ఎస్పీ, పార్వతీపురం మన్యం

క్లుప్తంగా

12న రాజాంలో మెగా జాబ్ మేళా

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 12న రాజాం నియోజకవర్గం స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ తెలిపారు. ఈ మేరకు జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ సోమవారం స్పందన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం రోడ్డులోని వరుణ్ షోరూం ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ విద్యార్హత కలిగిన వారంతా ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జాబ్ మేళాకు తమ రెజ్యూం, అర్హత నిర్ధారణ కోసం తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్ఓ ఎం.గణపతిరావు, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, ఎస్‌డీసీలు పద్మలత, సుదర్శన దొర, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ గోవిందరావు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: తల్లిదండ్రులు మందలించారని ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటనపై పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. జార్ఖండ్ రాష్ట్రం లథికర్ జిల్లా మూర్ప మండలం జక్కువ గ్రామానికి చెందిన కె.సునీత దేవి భర్తతో ప్రస్తుతం పార్వతీపురంలో నివాసం ఉంటూ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జార్ఖండ్ రాష్ట్రంలో ఉండకుండా పార్వతీపురం ఎందుకు వెళ్లారని సునీత దేవికి ఫోన్ చేసిన ఆమె తల్లిదండ్రులు ఆగ్రహించడంతో ఆమె మనస్తాపానికి గురైంది. దీంతో సోమవారం ఉదయం ఇంక్షన్‌లోని మందు తాగేసింది. ఈ విషయం భర్త గమనించి జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించాడు.

మొక్కజొన్న కొనుగోలుపై ఆరా



జమ్ములో ఎండబెట్టిన మొక్కజొన్న కండెలను పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి, వ్యవసాయ అధికారులు

గుర్ల: మండలంలోని జమ్ములో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ ప్రత్యేక జోనల్ అధికారి చిరంజీవి చౌదరి, వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు సోమవారం పరిశీలించారు. మొక్కజొన్న కొనుగోలు తీరును జమ్ముపేట సొసైటీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎండబెట్టిన మొక్కజొన్న కండెలను పరిశీలించారు. వర్ష సూచన ఉండడంతో మొక్కజొన్న కండెలు నుంచి గింజలను వేరుచేయలేదని రైతులు తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించడం వల్ల మేలు జరుగుతుందని పలువురు రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ తిరుపతిరావు, సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



రాజీవ్ వాస్తవ్‌కు గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

విజయనగరం ఫోర్ట్: విజయవాడలోని రాజ్‌భవన్‌లో సోమవారం జరిగిన రెడ్‌క్రాస్ వేడుకల్లో జిల్లాకు చెందిన పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ వాస్తవ్, అరబిందో ఫార్మా ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ రాధామాధవ్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ గోల్డ్‌మెడల్ ప్రదానం చేశారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు పాల్గొన్నారు.

సొసైటీల్లోనూ ఆన్‌లైన్ సేవలు

- డీసీసీబీ సీఈఓ జనార్దన



సీఎస్సీ సేవలను ప్రారంభిస్తున్న సీఈఓ జనార్దన

విజయనగరం ఫోర్ట్: డీసీసీబీ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోనూ ఆన్‌లైన్ సేవలు ప్రారంభిస్తామని డీసీసీబీ సీఈఓ కెంబూరి జనార్దన తెలిపారు. పార్వతీపురం సొసైటీలో కామన్ సర్వీసింగ్ సెంటర్ (సీఎస్సీ) సేవలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు ద్వారా ప్రజలకు 50 రకాల సేవలు అందిస్తామన్నారు. జిల్లాలో ఉన్న మిగిలిన సొసైటీల్లో కూడా సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

సర్వజన ఆస్పత్రిలో అత్యవసర సేవలు

- వెంటిలేటర్‌తో కూడిన వైద్యం
- 24 గంటల పాటు అందుబాటులో వైద్యులు
- పెరుగుతున్న రోగుల సంఖ్య



ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగులు



ఆక్సిజన్‌తో కూడిన వెంటిలేటర్స్

విజయనగరం ఫోర్ట్: ఎస్.కోట మండలం అలుగుబిల్లి గ్రామానికి చెందిన సింహాచలం(72) ఆయాసం, దగ్గుతో వారం రోజుల క్రితం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చాడు. పల్స్ రేటు 80కి పడిపోయింది. కోవిడ్ పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చింది. దీంతో ఐసీయూలో చేర్చి చికిత్స అందించారు. ఐదు రోజుల చికిత్స అనంతరం కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు.

- గంట్యాడ మండలం పెదవేమలి గ్రామానికి చెందిన పాశల సత్యం కొద్ది రోజుల క్రితం తీవ్రమైన కడుపునొప్పితో సర్వజన ఆస్పత్రిలో చేరడంతో కార్పొరేట్ ఆస్పత్రి తరహాలో శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు.
- ఇలా వారిద్దరికే కాదు. సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన వారికి సకాలంలో చికిత్స అందించి ఆరోగ్యవంతులను చేసి డిశార్జ్ చేస్తున్నారు. గతానికి భిన్నంగా వెంటిలేటర్‌తో రోగులకు చికిత్స అందిస్తున్నారు. గతంలో వెంటిలేటర్ చికిత్స అవసరమైతే కేజీహెచ్‌కు రిఫర్ చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి తప్పింది. ఆస్పత్రిలో ఆక్సిజన్, వెంటిలేటర్‌తో 30 పడకల ఐసీయు అందుబాటులోకి వచ్చింది.
- మానసిక రోగులు, డ్రగ్స్ బాధితులకు ప్రత్యేక వార్డు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మానసిక రోగులైన పురుషులు, స్త్రీలకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. అలాగే గంజాయి, కొకెయిన్, హెరాయిన్, బ్రౌన్ సుగర్, డ్రగ్ ఇంజక్షన్లకు అలవాటు పడిన పురుషులు, స్త్రీలకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు.

పెరిగిన ఓపీ, ఐపీ

ఆస్పత్రిలో సాధారణ చికిత్సలతో పాటు అత్యవసర సేవలు అందుబాటులోకి రావడంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. గతంలో ఔట్ పేషెంట్లు 500 నుంచి 600 మంది వరకు రోజూ వచ్చేవారు. ఇప్పుడు 800 నుంచి 1000 మంది రోజుకు వస్తున్నారు. అలాగే ఇన్ పేషెంట్లు గతంలో రోజుకు 50 నుంచి 60 మంది చేరితే ఇప్పుడు 80 నుంచి 100 మంది వరకు చేరుతున్నారు. గతంలో పలమనాలజీ సేవలు సర్వజన ఆస్పత్రిలో లేక పోవడంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రిలో చేరేవారు. ఇప్పుడు పలమనాలజీ సేవలు కూడా అందుబాటులోకి రావడంతో ఈవిభాగానికి కూడా రోజుకి 50 నుంచి 60 మంది రోగులు వస్తున్నారు.

ఆస్పత్రిలో మెరుగైన సేవలు

ఆస్పత్రికి వచ్చిన వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. అత్యవసర సేవలు కూడా 24 గంటల పాటు అందుతున్నాయి. రోగుల సంఖ్య కూడా పెరిగింది. వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తున్నారు.

– డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

అందుబాటులో ఆధునాతన శస్త్రచికిత్సలు

ఆస్పత్రిలో ఎముకలు, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, డెంటల్ తదితర శస్త్రచికిత్సలు చేస్తారు. ఆయా విభాగాల్లో క్రిటికల్ శస్త్రచికిత్సలు సైతం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం శ్వాస నాళాలు తెగిపోయిన ఓ వ్యక్తికి అత్యవసరంగా శస్త్రచికిత్స చేసి పునర్జన్మ ప్రసాదించారు. అంతేకాకుండా 24 గంటల పాటు వైద్య సేవలు అందిస్తున్నారు. దీని వల్ల ఏ సమయంలోనైనా వైద్య సేవలు అందుతాయనే భావన ప్రజల్లో నెలకొంది.

బాలిక దుర్మరణం

- బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం



మృతిచెందిన తనుష్య (ఫైల్)

పాచిపెంట: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో తొమ్మిదేళ్ల బాలిక మృతిచెందింది. మండలంలోని పణుకువలస జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన బర్ల శ్రీరాములునాయుడు ఇంటికి కుమార్తె కాంతకుమారి మనుమరాలు తనుష్య మనుమడు దీక్షిత్ వేసవి సెలవులు నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం వచ్చారు. సోమవారం ఉదయం కాంతకుమారి, తండ్రి శ్రీరాములు నాయుడు, కుమార్తె తనుష్యను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని సాలూరు వైపు వెళ్తుండగా సాలూరు నుంచి వస్తున్న ట్రాక్టర్ పణుకువలస జాతీయరహదారిపై బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తనుష్య అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన శ్రీరాములునాయుడిని, కాంతకుమారిని సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. శ్రీరాములు నాయుడు పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని స్థానిక ప్రజలు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న సాలూరు సీఐ ధనుంజయరావు, పాచిపెంట ఎస్ఐ వెంకటరమణ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో మాట్లాడి ట్రాఫిక్‌కు అంతరాయం తొలగించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి..

విజయనగరం క్రైమ్: స్థానిక వీటీ అగ్రహారం బీసీ కాలనీలో నివాసం ఉంటున్న ముడిమించి వెంకటరావు (46) రైలు ఢీకొని సోమవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. వెంకటరావు వరుణ్ మోటార్స్‌లో కార్ వాష్ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం కాయగూరలు తెచ్చేందుకు రైల్వే ట్రాక్ దాటి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న రైలును గమనించకపోవడంతో బలంగా ఢీకొంది. దీంతో శరీరం రెండు ముక్కలైపోయి, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి కొండ జూట్‌మిల్‌లో పనిచేసి రిటైర్ అయి, ఇంటికే పరిమితమయ్యారు. మృతుడికి భార్య పూర్ణిమ, కుమారుడు ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే జీఆర్‌పీ ఎస్సై రవివర్మ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.



పొలాల్లో విద్యుత్ షాక్‌తో మరణించిన పాడిఆవులు

విద్యుత్ షాక్‌తో పాడి ఆవులు..

పాలకొండ రూరల్: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన ఎం.జయశంకర్ రెండు పాడి ఆవులు విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాయి. గ్రామానికి సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పొలాల్లో విద్యుత్ వైర్లు తెడిపడ్డాయి. ఆదివారం సాయంత్రం నుంచి వీచిన భారీ గాలులు, వర్షం కారణంగా వైర్లు తెగిపడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో మేతకు వెళ్లిన పశువులు రాత్రి సమయంలో ప్రమాదం బారిన పడి మరణించినట్లు చెబుతున్నారు. సోమవారం వాటిని గమనించిన స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. మరణించిన జెర్సీ ఆవుల విలువ రూ.60వేలని వాటి యజమాని తెలిపాడు.

కలెక్టర్ కార్యాలయంలో మిల్లెట్ స్టాల్



మిల్లెట్ స్టాల్‌ను ప్రారంభించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా చిరుధాన్యాలకు ప్రాచుర్యం కల్పించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఇందులో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల (మిల్లెట్) స్టాల్‌ను కలెక్టర్ నిషాంత్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాలకు ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చిరుధాన్యాల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెరగాల్సి ఉందన్నారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి మంచివని చెప్పారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో రాగిమాల్ట్‌ను అందిస్తోందని గుర్తుచేశారు. కొర్రలు, ఆండు కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, రాగులు వంటి చిరుధాన్యాలు రక్త హీనత నివారణకు దోహద పడతాయని చెప్పారు. పూర్వకాలంలో చిరుధాన్యాలు ప్రధాన ఆహారంగా వినియోగంలో ఉండేవని, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు దూరంగా ఉండేవారన్నారు. చిరుధాన్యాల వినియోగం ప్రోత్సహించడంలో భాగంగా గిరిజనులు పండించే పంటలను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మలచి జిల్లా సమాఖ్య ద్వారా విక్రయిస్తున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి పి.కిరణ్‌కుమార్ తెలిపారు. మిల్లెట్‌స్టాల్స్ అన్ని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తామని, మహిళామార్ట్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మూడు కేసుల్లో 144కిలోల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట: గంజాయి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నిత్యం పోలీసులు నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలో గంజాయి పట్టుబడుతూనే ఉంది. ఈనెల 7వ తేదీన పట్టుబడిన గంజాయి వివరాలపై ఎస్.కోట సీఐ సింహాద్రినాయుడు సోమవారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఎస్.కోట ఎస్సై తారకేశ్వరరావు సిబ్బందితో బొడారా చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన మోహిత్‌కుమార్ అరకు నుంచి ఆటోలో 1కిలో గంజాయితో వస్తూ పట్టుబడ్డాడు. మోహిత్‌కుమార్ కిలో గంజాయిని రూ.3,500కు అరకులో కొనుగోలు చేశాడు. అదే సమయంలో ఐ20 కారులో అరకు నుంచి వస్తున్న విశాఖపట్నం ఆరిలోవకు చెందిన సాయిరాం, బొండాం గ్రామానికి చెందిన వీరాస్వామి 60కిలోల గంజాయితో పట్టుబడ్డారు. వారు గంజాయిని ఒడిశాలోని పటువా ప్రాంతంలో రూ.1,20,000లకు కొన్నారు. ఇదే కేసులో వారితోపాటు నిందితుడైన విశాఖ వాసి నితీష్ పరారీలో ఉన్నాడు. మరో కేసులో కేరళకు చెందిన నిషాంత్ కె.పి టాటా సఫారీ వాహనంలో 83కిలోల గంజాయితో పట్టుబడ్డాడు. రూ.1,80,000లకు ఒడిశా సరిహద్దు గ్రామాల్లో గంజాయి కొన్నాడు. ఈ మూడు కేసుల్లో 144కిలోల గంజాయిని, రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు.

స్నేహితుడిపై దాడి

పార్వతీపురం: స్నేహితులు పిలిచి దాడిచేసిన సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ మేరకు సోమవారం పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండల కేంద్రానికి చెందిన ఎస్.వినయ్‌కుమార్‌కు స్నేహితులు సీహెచ్.అనంత్, అజిత్‌లు ఫోన్ చేసి కూర్మాన భరత్ ఇంటికి రమ్మని పిలిచారు. ఈ మేరకు వినయ్‌కుమార్ నడుచుకుని వెళ్తుండగా, స్నేహితులు ఎదురుగా వచ్చి గతంలో జరిగిన గొడవలో భరత్‌కు వత్తాసు పలికావు ఇప్పుడు నీసంగతి చూస్తాం అంటూ వినయ్‌కుమార్‌ను పలుచోట్ల కర్రతో కొట్టగా గాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు సీతానగరం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

తోటపల్లి పనులకు భూమి పూజ



తోటపల్లి కాలువ పనులకు భూమి పూజచేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

- వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట
- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్
- తోటపల్లి పాత కుడి ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు ప్రారంభం

వంగర: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. తోటపల్లి కుడి ప్రధానకాలువ ఆధునికీకరణ పనుల్లో భాగంగా గరుగుబిల్లి మండలం సుంకి వద్ద రక్షణ గోడ నిర్మాణానికి, మరుపెంట వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజచేశారు. వంగర, గరుగుబిల్లి మండలాల ఆయకట్టు భూములకు ఈ కాలువ ఎంతో కీలకమని, సకాలంలో పనులు పూర్తిచేసి ఈ ఏడాది ఖరీఫ్ నాటికి సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. దశాబ్దాల కాలం నుంచి ఏ ప్రభుత్వాలు చేయలేని కాలువ పనులు మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చొరవతో రూ.29 కోట్ల వ్యయంతో సాగుతున్నాయన్నారు. భవిష్యత్తులో తోటపల్లి పాత కుడి ప్రధాన కాలువ ఆయకట్టు భూములకు సాగునీటి సమస్య తలెత్తదని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల బాలురకు అవకాశం
- సింహాచలం ఎంజేపీఏపీ బీసీ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సత్యారావు

నెల్లిమర్ల: విశాఖపట్నం జిల్లా సింహాచలంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దాసరి సత్యారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఇంగ్లీషు మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీలో 60, బైపీసీలో 40, సీఈసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇంటర్‌మీడియట్ క్లాసుల్లోనే ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేకంగా కోచింగ్ ఇస్తామని పేర్కొన్నారు. ప్రవేశాల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. ఈ ఏడాది పదోతరగతి ఉత్తీర్ణులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు ఈ నెల 18వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్థుల వయస్సు 31 ఆగస్టు 2023 నాటికి 17 సంవత్సరాలు మించకూడదని చెప్పారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ లక్షకు మించకూడదని, ఈ నెల 28న ప్రవేశ పరీక్ష పరీక్ష ఉంటుందన్నారు. వచ్చే నెల 10వ తేదీన ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. విద్యార్థులు హెచ్‌టిటిపి://ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎస్ఎస్.ఐఎన్/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 6301722371లో తనను సంప్రదించాలని సూచించారు.

డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్స్ ఇవ్వాలి

- కలెక్టర్‌కు ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ వినతి



కలెక్టరేట్ ఎదుట ఏపీయూడబ్ల్యూజే సభ్యులు

విజయనగరం అర్బన్: సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా పత్రికలో పనిచేస్తున్న డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ మంజూరు చేయాలని ఏపీయుడబ్ల్యూజే జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా కమిటీ సభ్యులు కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. తొలుత కల్టెరేట్ ఎదుట నిరసన చేపట్టారు. జిల్లాల విభజన నేపథ్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో చెల్లుబాటయ్యేలా బస్‌పాసులు ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. ఎలక్ట్రానిక్ మీడియాకు జిల్లా కేంద్రంలో నాలుగు అదనపు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రింట్ మీడియాకు సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా మండలానికి ఒక అక్రిడేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ మూడు సెంట్ల ఇంటి స్థలం, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. రైల్వే జర్నీలో రాయితీలను పునరుద్ధరించాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు పీఎస్‌పీశివప్రసాద్, ఎలిశెట్టి సురేష్‌కుమార్, రాధాకృష్ణ, వైఎస్‌పంతులు, జిల్లా కమిటీ నాయకులు మహాపాత్రో, విజయభాస్కర్, భరత్, డేవిడ్ రాజు, శంకరరావు, శివప్రసాద్, కిశోర్ తదితరులు ఉన్నారు.

14.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేటలో బియ్యం వ్యాపారి రమణమూర్తి ఇంట్లో 14.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలను విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు సోమవారం సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ వి సింహాచలం, సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణ తదితరులు తమ సిబ్బందితో రమణమూర్తి ఇంట్లో ఉన్న బియ్యం నిల్వలను గుర్తించారు. వెంటనే బియ్యాన్ని సీజ్ చేసి బియ్యాన్ని కస్టోడియన్‌కు అప్పగించారు. వ్యాపారిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ తెలిపారు.

తామరపల్లిలో..

గంట్యాడ: మండలంలోని కొండతామరపల్లి గ్రామంలో పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఆదిమూలం సన్యాసిరావు పీడీఎస్ బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో సన్యాసిరావు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 13 క్వింటాళ్ల బియ్యాన్ని విజిలెన్స్ సీఐ ఎం.అప్పలనాయుడు, సీఎస్‌డీటీ ఇందిరలు ఆదివారం రాత్రి సీజ్ చేశారు. ఫిబ్రవరిలో సన్యాసిరావు 6 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా నిల్వ చేసినందుకుగాను 6 ఎ కేసును రెవెన్యూ అధికారులు నమోదు చేశారు. పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేయడం, విక్రయించడం చట్టరీత్యానేరమని అధికారులు తెలిపారు.

రాయితీపై రుణాలు

- ఏపీఫుడ్ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి



బేకరీ తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి

చీపురుపల్లి: పేద, మధ్యతరగతి వర్గాల ఆర్థిక అభ్యున్నతి కోసం వివిధ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 35 శాతం రాయితీపై అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఫుడ్ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సీహెచ్ చిరంజీవిచౌదరి అన్నారు. పీఎఫ్ఎంఎఫ్‌పీఈ పథకంలో భాగంగా చీపురుపల్లి పట్టణంలో రూ.10 లక్షల రుణంతో ఏర్పాటుచేసిన బేకరీను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో రుణం పొందిన వారికి 35 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రతినెలా బ్యాంకు వాయిదాలు సకాలంలో చెల్లిస్తూ పరపతి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఓ జమదగ్ని, మార్కెటింగ్ ఏడీ శ్యామ్‌కుమార్, హెచ్ఓ చంద్రశేఖర్, తహసీల్దార్ ఎం.సురేష్, ఏపీఎమ్‌లు ఎం.వి.రాజశేఖర్, ఆర్.అనూరాధ, ఎ.పద్మావతి, కె.అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో రాణించాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

గంట్యాడ: క్రీడాస్ఫూర్తితో ఆటల్లో రాణించాలని క్రీడాకారులకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సూచించారు. చినమానపురం గ్రామంలో పైడితల్లి అమ్మవారి పండగను పురస్కరించుకుని జిల్లా వాలీబాల్ అసోసియేషన్, యూత్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన సోమవారం సాయంత్రం ప్రారంభించారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట శివపార్వతి, ఎంపీటీసీ సభ్యుడు లెంకమోహనరావు, వైస్ సర్పంచ్ చల్ల వెంకటరత్నం, బీల అప్పలనాయుడు, చల్ల కృష్ణ, శివన్నారాయణ, నాయుడుబాబు, ఎర్ని సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీడాక్టర్ సేవలు భేష్

- నెలరోజుల్లో 75 వేల మందికి వైద్యం



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా నెలరోజుల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 75,106 మందికి వైద్య సేవలు అందించామని 104 జిల్లా మేనేజర్ బైరెడ్డి వినోద్‌కుమార్ తెలిపారు. విజయనగరంలోని 104 సేవల కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 35,434 మందికి జనరల్ ఓపీ సేవలు, 5,406 మంది గర్భిణులు, 1574 మంది బాలింతలు, 14,922 మంది బీపీ రోగులు, 6,366 మంది సుగర్ వ్యాధిగ్రస్తులు, 10,019 మంది బీపీ, సుగర్ ఉన్నవారికి వైద్యసేవలు అందించినట్లు వెల్లడించారు. 182 మందికి ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్, 189 మంది బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ చేశామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని చెప్పారు. సమావేశంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ సంతోష్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

తాటికమ్మలతో కూల్‌కూల్‌గా..



విజయనగరం జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 10 గంటలైతే చాలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు జనం భయపడుతున్నారు. వాహనాల్లో ప్రయాణించాలంటే ఉక్కిరిబిక్కిరవుతామంటూ బెంబేలెత్తుతున్నారు. జనం ఎండ కష్టాలను ఆలకించిన ఓ ఆటో డ్రైవర్ వినూత్నంగా ఆలోచించాడు. తాటికమ్మలను టాప్‌పై కట్టి ఆటోలో ప్రయాణించేవారికి ఎండతాకిడి నుంచి రక్షణ కల్పిస్తున్నాడు. ప్రయాణికులను ఆకర్షిస్తున్నాడు. దీనికి విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద 'సాక్షి' కెమెరాకు చిక్కిన ఈ దృశ్యమే నిలువెత్తు సాక్ష్యం.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం